## గణతంత్ర వేడుకకు ఏర్పాట్లు పూర్తి చేయండి

### జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ



ఎస్పీ కార్యాలయంలో గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై ఆరా తీస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ

వికారాబాద్, జనవరి 24 : గణతంత్ర దినోత్సవ వేడుకలను ఎస్పీ కార్యాలయంలోని పరేడ్ గ్రౌండ్స్‌లో ఏర్పాట్లను పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. బుధవారం ఎస్పీ కార్యాలయంలో ఏర్పాట్లను ఎస్పీ కోటిరెడ్డి తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పరేడ్ గ్రౌండ్స్‌లో ముఖ్యఅతిథి సందేశం, పోలీసు గౌరవ వందనం, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ శాఖల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనుల స్టాల్స్, వీఐపీ మీడియా ప్రతినిధులకు సంబంధించిన గ్యాలరీలో ఏర్పాటుతో పాటు, ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాల అందజేత తదితరులు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రవీందర్‌రెడ్డి, డీఆర్‌డీవో కృష్ణన్, వికారాబాద్ ఆర్డీవోవిజయ కుమారి, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి అమరేందర్, మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


## పార్ట్ టైం లెక్చరర్ నియామకాల్లో అవకతవకలు

### విచారణ జరిపించాలని విద్యార్థి సంఘాల డిమాండ్

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 24 : ఉస్మానియా యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో పార్ట్ టైం లెక్చరర్ నియామకాల్లో జరిగిన అవినీతిపై విచారణ జరిపించాలని విద్యార్థులు డిమాండ్ చేస్తూ కళాశాల ఎదుట బుధవారం ఆందోళనకు దిగారు. కళాశాల ప్రిన్సిపల్, ఓఎస్డీ టు వీసీ ఇద్దరూ కలిసి తమకు కావాల్సిన వారికి ఉద్యోగాలు ఇప్పించుకున్నారని ఆరోపించారు. ఈ ఉదంతంలో పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారినట్లు అనుమానాలు ఉన్నాయని అన్నారు. తక్షణమే అవకతవకలకు పాల్పడిన వారిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పరిపాలనా భవనాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు అశోక్‌నాయక్, సతీశ్‌గౌడ్, నాగరాజు, వెంకటేశ్, గణేశ్, ప్రవీణ్, గోపి, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.




ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులు



రోడ్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న అప్పటి విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి (ఫైల్)




దుమ్ము రేగుతున్న శ్రీరాంనగర్ రోడ్డు

# రోడ్లను పట్టించుకోరా..?



మొయినాబాద్ నుంచి ముర్తుజాగూడ రోడ్డుకు చేసిన శిలా ఫలకం

మొయినాబాద్, జనవరి 24 : గ్రామీణ రోడ్లు ధ్వంసమయ్యాయి. రెండేండ్ల పాటు కురిసిన వర్షాలు, పంచాయతీరాజ్ రోడ్ల మీద సామర్థ్యానికి మించిన భారీ వాహనాలు వెళ్లడంతో రోడ్లు పూర్తిగా దెబ్బ తిన్నాయి. రోడ్లపై గుంతలు పడడంతో ప్రయాణం నరకయాతనగా మారింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇలా రోడ్లు పూర్తిగా అధ్వానంగా మారడంతో గత ప్రభుత్వం మొయినాబాద్ మండలంలోని పలు గ్రామాల రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేసింది. ఆ రోడ్ల పనులకు సంబంధించిన నిధులను విడుదల చేస్తూ ప్రొసీడింగ్‌లను విడుదల చేసింది. నిధుల మంజూరు తర్వాత అప్పటి ప్రభుత్వం టెండర్లను కూడా పిలిచింది. కొన్ని పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాగా.. మరికొన్ని పనులకు ముందుకు రాలేదు. అంతలోనే సాధారణ ఎన్నికలు రావడంతో పనులకు టెండర్లను మళ్లీ పిలువలేకపోయారు. ఎన్నికల అనంతరం ప్రభుత్వం మారడంతో నిధులు మంజూరైనా రోడ్ల అభివృద్ధి మాత్రం అటకెక్కింది. పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్లు వాటిని ప్రారంభించడానికి నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని పనులు వేగవంతంగా పూర్తయ్యేలా చూడాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

**రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు ఇలా..**

మొయినాబాద్ మండలంలోని 10 రోడ్లను అభివృద్ధి చేసేందుకు గత ప్రభుత్వం 2023లో ఆగస్టు 11న నిధులు మంజూరు చేస్తూ ప్రొసీడింగ్‌లను విడుదల చేసింది. నిధుల మంజూరు తర్వాత అప్పటి విద్యాశాఖ మంత్రి పట్లోళ్ల సబితారెడ్డి, చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, జడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డిలు ఆయా గ్రామాల రోడ్ల పనులను ప్రారంభించేందుకు 2023 సెప్టెంబర్ 11న శంకుస్థాపనలు చేశారు. పనులకు టెండర్ కాల్ చేసి త్వరగా పనులు ప్రారంభించాలని వారు సంబంధిత అధికారులను ఆదేశించారు. అంతలోనే ఎన్నికలు రావడంతో టెండర్ కాల్ ఆగిపోయింది.

**ఆరు నెలల ముందే అగ్రిమెంట్లు చేసుకున్నా..**

రోడ్ల పనులను చేయడానికి కాంట్రాక్టర్లు ఎన్నికలకు ఆరు నెలల ముందే అగ్రిమెంట్లు చేసుకున్నారు. అయితే పనులను ప్రారంభించడం లేదు. అధికారులు చెప్పినా స్పందించడం లేదు. ఈ అగ్రిమెంట్లను రద్దు చేసి కొత్త కాంట్రాక్టర్లకు పనులు అప్పజెప్పాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కనకమామిడి నుంచి వెంకటాపూర్ వరకు రోడ్డు అభివృద్ధికి రూ.6.50 కోట్లు మంజూరయ్యాయి. వీటితో పాటు పెద్దమంగళారం నుంచి చందానగర్ గేట్ వరకు ఉన్న రోడ్డు పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్లు పనులను ప్రారంభించడం లేదు. అజీజ్‌నగర్ పాత గేట్ (హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి నుంచి) నుంచి వయా అజీజ్‌నగర్, నాగిరెడ్డిగూడ మీదుగా బాకారం వరకు రోడ్డు అభివృద్ధి కోసం రూ.13 కోట్లు మంజూరయ్యాయి. పనులు నాగిరెడ్డిగూడ వరకు పూర్తయ్యాయి. నాగిరెడ్డిగూడ నుంచి బాకారం వరకు పనులు చేయడానికి నిధులు సరిపోకపోవడంతో మరో రూ.3 కోట్లు అదనంగా మంజూరయ్యాయి. ఆ పనులను చేయాల్సి ఉన్నది. మిగిలిన గ్రామాల రోడ్ల అభివృద్ధి పనులు ప్రారంభించేందుకు మళ్లీ టెండర్లు పిలవాల్సి వస్తుందని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

- ధ్వంసమైన రోడ్లతో ప్రయాణికుల నరకయాతన
- నిధులు మంజూరు చేసి.. ప్రొసీడింగ్‌లూ విడుదల
- మొయినాబాద్ మండలంలో 10 రోడ్ల అభివృద్ధికి రూ.24కోట్లు మంజూరు
- కాంట్రాక్టర్లు అగ్రిమెంట్లు చేసుకున్నా ముందుకు సాగని పనులు
- మరికొన్ని పనులకు టెండర్లు పిలిచినా.. ఎవరూ రాని వైనం
- త్వరలో ప్రారంభించాలని కోరుతున్న ప్రజలు

- మండలంలోని పెద్దమంగళారం నుంచి చందానగర్ గేట్ వరకు రోడ్డును బీటీ చేసేందుకు రూ.2.80 కోట్లు
- అమ్డాపూర్ నుంచి శ్రీరాంనగర్ వరకు కొత్త రోడ్డు వేసేందుకు రూ.3.50 కోట్లు.
- తోలుకట్టా గేట్ (హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి) నుంచి నక్కలపల్లి వరకు బీటీ కోసం రూ.1.20 కోట్లు
- నక్కలపల్లి గ్రామ సమీపంలో రోడ్డు మధ్యలోని కల్వర్టు నిర్మాణంతో పాటు బీటీ కోసం రూ.38.50 లక్షలు
- సురంగల్ నుంచి వయా శ్రీరాంనగర్ మీదుగా వెంకటాపూర్ వరకు బీటీ కోసం రూ.1.20 కోట్లు
- ఎన్కేపల్లి నుంచి బాకారం వరకు బీటీ నిర్మాణ పనులకు రూ.2.50 కోట్లు.
- నాగిరెడ్డిగూడ నుంచి బాకారం రోడ్డు బీటీ కోసం రూ.3 కోట్లు
- కనకమామిడి నుంచి వెంకటాపూర్ వరకు బీటీ కోసం రూ.6.50 కోట్లు
- అమ్డాపూర్ రోడ్డు నుంచి ముర్తుజాగూడ వరకు నూతన బీటీ రోడ్డు నిర్మాణ పనులకు రూ.85 లక్షలు
- ముర్తుజాగూడ నుంచి మొయినాబాద్ వరకు నూతన బీటీ రోడ్డు నిర్మాణం కోసం రూ.1.40 కోట్లు మంజూరు చేస్తూ గత ప్రభుత్వం ప్రొసీడింగ్‌లు విడుదల చేసింది

### ఎన్నికలు రావడంతో..



ఎన్నికలకు ముందు మండలంలోని పది గ్రామాల రోడ్ల అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యాయి. కొన్ని పనులను కాంట్రాక్టర్లు దక్కించుకుని అగ్రిమెంట్లు చేసుకున్నారు. ఎన్నికలు రావడంతో పనులు ఆగిపోయాయి. పనులు మొదలు పెట్టాలని కాంట్రాక్టర్లకు సూచిస్తున్నాం. త్వరలోనే పనులను మొదలు పెట్టిస్తాం. ఎన్నికలకు ముందే అన్ని రోడ్ల పనులకు టెండర్ కాల్ చేశాం. కానీ కొన్ని రోడ్ల పనుల టెండర్లకు కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. మిగిలిపోయిన రోడ్లకు మళ్లీ టెండర్ కాల్ చేస్తాం. టెండర్ కాల్ పూర్తి కాగానే పనులను మొదలు పెట్టిస్తాం. కొన్ని రోడ్లకు కాంట్రాక్టర్లు అగ్రిమెంట్లు చేసుకున్నారు. పనులను త్వరగా మొదలు పెట్టాలని ఆదేశిస్తున్నాం. త్వరలోనే మొదలు పెడుతామని చెబుతున్నారు.

– విజయ్‌కుమార్, డీఈ, పంచాయతీ రాజ్

### రోడ్డు మీద ప్రయాణమంటేనే నరకం చూస్తున్నాం



సురంగల్ నుంచి శ్రీరాంనగర్, వెంకటాపూర్ వరకు రోడ్డు పూర్తిగా ధ్వంసం కావడంతో గుంతలు ఏర్పడ్డాయి. వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు అవుతున్నాయి. రోడ్డు మీద వాహనాలను నడిపాలంటేనే నరకం అనుభవిస్తున్నాం. అత్యవసర పరిస్థితిలో దవాఖానకు వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నాం. మధ్యలోనే ప్రాణాలు పోయే పరిస్థితి కనిపిస్తున్నది. నిధులు మంజూరైనా ఇప్పటివరకు పనులు చేయడానికి ఆసక్తి చూపడం లేదు. గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఈ ప్రభుత్వం పనులను పూర్తి చేస్తే ప్రజలకు చాలా మేలు జరుగనున్నది. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.

– మంగళారం జంగారెడ్డి, శ్రీరాంనగర్, మొయినాబాద్



ఉప్పల్ క్రికెట్ స్టేడియంలో భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీపీ సుధీర్‌బాబు, డీసీపీ పద్మజా

## ఉప్పల్ క్రికెట్ మ్యాచ్‌కు.. పోలీసుల పటిష్ట బందోబస్తు

**క్రీడాస్ఫూర్తిని చాటుతూ, నగర ఔన్నత్యాన్ని పెంచుదాం**

**రాచకొండ సీపీ సుధీర్‌బాబు**

**నేడు భారత్, ఇంగ్లాండ్ టెస్టు మ్యాచ్ ప్రారంభం**

ఉప్పల్, జనవరి 24 : ఉప్పల్ రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో గురువారం నుంచి భారత్- ఇంగ్లాండ్ జట్ల మధ్య టెస్టు మ్యాచ్ ప్రారంభం కానుంది. ఈ క్రికెట్ మ్యాచ్‌కు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు రాచకొండ సీపీ సుధీర్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఉప్పల్ క్రికెట్ స్టేడియంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీపీ సుధీర్‌బాబు, మల్కాజిగిరి డీసీపీ పద్మజా, ట్రాఫిక్ డీసీపీ కె.మనోహర్ వివరాలను వెల్లడించారు. స్టేడియంలో జరిగే మ్యాచ్ కోసం 1500 మంది సిబ్బందితో భద్రత ఏర్పాట్లు చేశామన్నారు ట్రాఫిక్ సమస్యలు రాకుండా తగిన స్థలాలను ఏర్పాటు చేశామని, తగిన సూచనలు కూడా చేస్తున్నామని తెలిపారు. బార్‌కోడ్ ట్యాంపరింగ్, బ్లాక్ టికెట్లు, మహిళలను వేధిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. మ్యాచ్ భద్రత కోసం 360 కెమెరాలతో నిఘా ఉంటుందన్నారు. నిత్యం పర్యవేక్షణ చేస్తూ, సిబ్బంది అప్రమత్తంగా ఉంటారన్నారు. అనుమతిలేని వస్తువులను స్టేడియంలోకి తీసుకురావద్దని సూచించారు. మ్యాచ్‌కి మూడు గంటల నుంచే స్టేడియంలోకి అనుమతి ఇస్తామన్నారు. ఉదయం 9.30 గంటలకే మ్యాచ్ ప్రారంభం కానున్న నేపథ్యంలో ట్రాఫిక్ నియంత్రణకు తగిన ఏర్పాట్లు చేశామన్నారు. క్రమశిక్షణను పాటిస్తూ, దేశ ఔన్నత్యాన్ని పెంపొందించే విధంగా హైదరాబాద్ నగర క్రీడా అభిమానులు సహకరించాలన్నారు. ఎవరికి కేటాయించిన గేట్ల నుంచి వారే వెళ్లాలని తెలిపారు. 39,600 మంది వీక్షించేందుకు వీలుగా స్టేడియంలో ఏర్పాట్లు ఉన్నాయని, ప్రేక్షకులు సహకరించాలన్నారు. పాఠశాల విద్యార్థులకు స్టేడియంలో మ్యాచ్ చూసేందుకు అనుమతి ఇచ్చామని, అందరు సహకరించాలన్నారు. ఈ సమావేశంలో ఏసీపీలు చంద్రశేఖర్, శ్రీనివాస్‌రావు, ఉప్పల్ ఇన్‌స్పెక్టర్ ఎలక్షన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**వీటికి అనుమతి లేదు..**

స్టేడియంలోకి ల్యాప్‌టాప్స్, కెమెరాలు, మ్యాచ్ బాక్సు, బైనక్యూలర్స్, బాటిల్స్, బ్యాగులు, బ్యానర్లు, సిగరెట్లు, లైటర్స్, హెల్మెట్లు, బ్యాటరీలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, పవర్ బ్యాంక్స్, అవుట్‌సైడ్ ఫుడ్స్, తదితర వస్తువులకు అనుమతి లేదన్నారు.

## మార్కులు తక్కువస్తాయన్న భయంతో.. బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు బాలుడు

### గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించిన నాంపల్లి పోలీసులు




బెంగళూరులో అదృశ్యమైన బాలుడిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న నాంపల్లి ఇన్‌స్పెక్టర్ అభిలాష్

సుల్తాన్‌బజార్, జనవరి 24: పరీక్షల్లో తక్కువ మార్కులు వస్తాయని భయపడ్డ 11 ఏండ్ల బాలుడు ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు వచ్చాడు. ఆ బాలుడు నాంపల్లి మెట్రో రైల్వే స్టేషన్‌లో తచ్చాడుతుండగా మెట్రో అధికారులు గమనించి నాంపల్లి పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకొని బాలుడిని చేరదీసి, పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి వివరాలను సేకరించారు. ఇన్‌స్పెక్టర్ అభిలాష్ కథనం ప్రకారం.. బెంగళూరులోని వైట్‌ఫీల్డ్ ప్రాంతానికి చెందిన సుఖేష్ అరయ్ కుమారుడు పరిణవ్ అరయ్ (11) ఆరో తరగతి చదు వుతున్నాడు. మంచి మార్కుల కోసం ట్యూషన్ కూడా వెళ్తున్నాడు. అయినా.. తనకు తక్కువ మార్కులు వస్తాయన్న భయంతో పరిణవ్ అరవ్ ఈ నెల 21న ట్యూషన్ తరగతులు ముగించుకొని బయటికి వచ్చిన బాలుడు బస్సు ఎక్కి కనిపించకుండా పోయాడు. బాలుడి తండ్రి బెంగళూరులోని వైట్‌ఫీల్డ్ పోలీస్‌స్టేషన్‌లో అదృశ్యంపై ఫిర్యాదు చేయగా.. కిడ్నాప్ కేసుగా నమోదు చేశారు. కేసు దర్యాప్తు చేపట్టిన వైట్‌ఫీల్డ్ పోలీసులు సీసీ కెమెరాల సహాయంతో 21వ తేదీ సాయంత్రం వరకు బాలుడి కార్యకలాపాలను గుర్తించారు. మంగళవారం రాత్రి బెంగళూరులోని మెజిస్టిక్ రైల్వే స్టేషన్‌లో బాలుడిని చివరిగా గుర్తించారు. అక్కడి నుంచి బాలుడు చెన్నయ్ నుంచి హైదరాబాద్‌కు వచ్చే రైలులో హైదరాబాద్‌కు చేరుకున్నాడు. బుధవారం ఉదయం బాలుడు నాంపల్లి మెట్రో స్టేషన్‌లో తచ్చాడుతుండగా బెంగళూరు వాసి గుర్తించి మెట్రో అధికారులకు సమాచారమిచ్చాడు. వారు నాంపల్లి పోలీసులకు సమాచారమిచ్చారు. అక్కడికి చేరుకున్న పోలీసులు.. బాలుడిని చేరదీసి నాంపల్లి పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి, వివరాలను సేకరించారు. బాలుడి తల్లిదండ్రులకు, వైట్‌ఫీల్డ్ పోలీసులకు సమాచారమిచ్చారు. నగరంలోనే ఉంటున్న బాలుడి మామ అలహరి మల్లికార్జున్ నాయుడుకు బాలుడిని అప్పగించారు.

## కాంగ్రెస్ పాలనలో కరెంటు కష్టాలు


### – రావులపల్లిలో సెల్‌ఫోన్ లైట్లతో సమావేశం



రావులపల్లిలో సెల్‌ఫోన్ లైట్లతో సమావేశం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

మర్పల్లి, జనవరి 24 : కాంగ్రెస్ పాలలో కష్టాలు మొదలయ్యాయని బీఆర్‌ఎస్ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ అన్నారు. బుధవారం మర్పల్లి మండల పరిధిలోని రావులపల్లిలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు గడవక ముందే ప్రజలు, రైతులకు కరెంటు కష్టాలు మొదలయ్యాయన్నారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అనివార్య కారణాలతోనే కరెంటు పోయేదని, ప్రస్తుతం ఎప్పుడు వస్తుందో... ఎప్పుడు పోతుందో తెలియడం లేదన్నారు. రాత్రి సమయంలో ఏమైనా సభలు సమావేశాలు జరుపుకోవాలంటే సెల్ ఫోన్‌ల ద్వారా లైట్ వేసుకొని జరుపుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జీఐఎస్ విధానం అమలుపై శిక్షణ




మాట్లాడుతున్న జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డి

సిటీబ్యూరో, జనవరి 24 (నమస్తే తెలంగాణ) : వినియోగదారులకు మెరుగైన సేవలందించడమే లక్ష్యంగా ఎప్పటికప్పుడు ఆధునిక సాంకేతికతను జలమండలి అందిపుచ్చుకుంటుంది. ఈ మేరకు గత నవంబర్‌లో జీఐఎస్ (జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టం) విభాగాన్ని ఏర్పాటు చేసింది. తాగు, మురుగునీటి నిర్వహణ, నెట్‌వర్క్ పర్యవేక్షణ, ప్లానింగ్ తదితర సంస్థ కార్యకలాపాలను సమర్థవంతంగా నిర్వహించాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలోనే 25 మంది జీఐఎస్ సిస్టం విధి విధానాలపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 22న ప్రారంభం కాగా బుధవారం శిక్షణ ముగిసింది. దీంతో ఎండీ సుదర్శన్‌రెడ్డి వారికి ధ్రువ పత్రాలను అందజేశారు. శిక్షణ పొందిన వారిలో ఒక జీఎం సహ డీజీఎం, మేనేజర్లు ఉన్నారు. జీఐఎస్ సెల్‌తో క్షేత్రస్థాయిలో సెక్షన్ లెవల్‌లోనే సంబంధిత అధికారులు ఆ సమాచారాన్ని యాక్సెస్ చేయవచ్చు. ఫలితంగా డేటా సంబంధిత అధికారులకు అందుబాటులో ఉండటంతో సమయం తగ్గి మెరుగైన సేవలను అందించే వీలు ఉంటుంది. శిక్షణ ముగింపు కార్యక్రమంలో రెవెన్యూ డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్‌కుమార్, సీజీఎం ఐటీ టీవీ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## రక్తహీనతపై పోరాటానికి ముక్తభారత్

జూబ్లీహిల్స్, జనవరి 24 : విద్యార్థుల్లో హిమోగ్లోబిన్ శాతం తక్కువగా ఉంటే నీరసంగా ఉంటూ చదువుపై శ్రద్ధ చూపలేరని.. ఇలాంటి విద్యార్థుల కోసం రక్తహీనత ముక్తభారత్ కార్యక్రమం చేపడుతున్నామని రంగారెడ్డి జిల్లా వైద్యాధికారి డాక్టర్ బి.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 8వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థుల కోసం చేపడుతున్న కార్యక్రమాన్ని శివరాంపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మార్చి 11 వరకు 47 రోజులపాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారని అన్నారు. ఇందులో భాగంగా ప్రతి విద్యార్థికి హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి రక్తంలో హిమోగ్లోబిన్ శాతం తక్కువగా ఉన్న విద్యార్థులకు నెలకు సరిపడా ఐరన్ మాత్రలు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎమినైజేషన్ ఆఫీసర్ డాక్టర్ స్వర్ణకుమారి, డాక్టర్ సృజన, డాక్టర్ రాజ్‌కుమార్, వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.